సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ముగ్గురమ్మల పండగ నేడు



కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువుదీరిన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ప్రథమ పండగ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, గ్రామ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. అమ్మవార్ల ఆలయ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తయిన సందర్భంగా పండగను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వేకువ జాము నుంచే విశేష పూజలు ప్రారంభమవుతాయన్నారు.

నూతన డిగ్రీ విధానంతో విస్తృత ఉద్యోగావకాశాలు

గాజువాక: నూతన డిగ్రీ విద్యా విధానంతో ప్రపంచవ్యాప్తంగా విస్తృత ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు అన్నారు. నూతన డిగ్రీ విద్యా విధానంపై కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమైన డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు, బీఎస్సీ హానర్స్ డిగ్రీ అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయన్నారు. అనంతరం పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బృహద్వారాహిదేవిగా శ్రీమహాదుర్గ



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో వారాహి నవ రాత్రి పూజలు కనులపండువగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా బుధవారం శ్రీమహాదుర్గను బృహద్వారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన నిర్వహించారు. శత్రుస్తంభన, శత్రువశీకరణం చేయాలంటూ అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలమాంబ కల్యాణ మండపం నిర్వహణకు వేలం

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీకరక చెట్టు పోలమాంబ ఆలయంలో ఉన్న కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన వేలం పాటలో రెండేళ్లకు వేలం వేయగా.. ఏడాదికి రూ.45.65 లక్షలకు నగరానికి చెందిన సింహాద్రి దక్కించుకున్నారు. రెండో ఏడాది పది శాతం అద్దెను పెంచనున్నారు.ఆలయ ప్రాంగణంలో షాపు నంబరు–1కు వేలం పాట నిర్వహించగా.. రూ.11,300కు దక్కించుకున్నారు.

ఏఎంసీ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కె20 బ్యాచ్ జట్టుతో 2కె22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

యోగాతో ఆనందమయ జీవనం

నిత్యం యోగసాధనతో ఆనందమయ జీవనం సొంతమవుతుందని యోగా గురువులు తెలిపారు. మానసిక ఒత్తిడి దూరమై, క్రమబద్ధమైన జీవనశైలిని అందించే యోగాను ప్రతీ ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కార్యాలయాల్లో, పాఠశాలల్లోనూ యోగాభ్యాసం చేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.



నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

గాజువాక: అంతర్జాతీయ దినోత్సవాన్ని గాజువాకలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల యోగా, ధ్యాన శిబిరాలను నిర్వహించారు.

- స్థానిక వుడా కాలనీలోని ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో యోగా గురు రాజేంద్ర ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు యోగాసనాలను వేశారు. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ ఎ.బాల రెడ్డి, ప్రిన్సిపాల్ కోమలి దేవి, డీన్ ఫిలోమినా తదితరులు పాల్గొన్నారు.
- గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా సాధన ద్వారా పొందే ప్రయోజనాలను యోగా గురువు సుబ్బారావు వివరించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కులుకూరి మంగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు వుడా వరహాలశెట్టి, ఏవీఎస్ఎన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.
- గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ గాజువాక కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణను బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. బీజేపీ నాయకులు రోహిణి, జ్యోతి, సాహితి, నారాయణ ప్రభు తదితరులు పాల్గొన్నారు.
- బ్రహ్మకుమారీ సంస్థ సహకారంతో శ్రీనగర్‌లోని యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. యాపిల్ ఐ సంస్థ చైర్మన్ టి.బలరామకృష్ణ, యోగా గురువు చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ప్రాణాయామం, ధ్యానం చేయించారు. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ధ్యాన కేంద్రం అధ్యక్షుడు మీసాల శివ గణేశ్వరరావు, డాక్టర్ భాగ్యగౌరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సమతానగర్ ఎల్ఐజీ పార్కులో పలువురు యోగాసనాలు వేశారు. కొల్లి ఈశ్వరరావు, విక్టర్ రాజు, జాన్ డీన్, వై.మన్మథరావు, రామకృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో ఎంఎస్‌ఎంఈ విశ్రాంత ఏడీ, యోగా గురువు కె.అప్పల రాజు ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ అధికారులు, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు యోగాసనాలు వేశారు. ఎంఎస్‌ఎంఈ ఇన్‌చార్జి ఏడీ చంద్రమౌళి, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ఏడీలు ఎస్.ఎల్.ఎం.కుమార్, బి.ఎ.ఎ.వి.ప్రభాకర్ కుమార్, శ్రీనివాసరావు, కె.ఎల్.ఎస్.రెడ్డి, డి.వీరయ్య, వాసీవా ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరాజు, కార్యదర్శి పి.వి.రామ్‌ప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వర రావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో పీడీ మహ్మద్ ఇస్మాయిల్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం పాల్గొన్నారు.
- భెల్‌లో ఫ్రెండ్స్ పవర్ యోగా ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులతో యోగా ట్రైనీలు గంటా దేముడు, పల్లం శ్రీనివాసు, ఎ.గోపి, పి.పద్మజ యోగాసనాలు వేయించారు. యోగా అసోసియేషన్ సభ్యులు గోపిశెట్టి ఆదినారాయణ, శ్రీనివాస రెడ్డి, కోపరేటివ్ సొసైటీ మేనేజర్ గవర వెంకటరమణా రావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఇండోర్ స్టేడియంలో..

ఉక్కునగరం: ఉక్కు ఇండోర్ స్టేడియంలో యోగా సెషన్‌ను స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ప్రారంభించారు. యోగా గురువులు ఎ. కనకరావు, ఎ. శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, పలువురు సీనియర్ అధికారులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

- స్థానిక సెక్టార్–11లోని సృష్టి వరల్డ్ స్కూల్‌లో ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ వింగ్‌లకు చెందిన బాలబాలికలు యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. యోగా ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రావు విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. చీఫ్ ప్రిన్సిపాల్ శ్రీధర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ సునయన తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహిళా కళాశాలలో..

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. సీఈవో శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీన్ డాక్టర్ కె. దుర్గా శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది విద్యార్థినులు యోగాసనాలు అభ్యాసం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అరుంధతి పాల్గొన్నారు.



సమతానగర్ ఎల్ఐజీ పార్కులో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



ఉక్కు స్టేడియంలో యోగా దినోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్, అధికారులు



యాపిల్ ఐ స్కూల్‌లో..



ఓక్ వ్యాలీ స్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు



వాసీవా భవనంలో యోగాసనాలు వేస్తున్న ఎంఎస్‌ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలు



విజ్ఞాన్ మహిళా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



ఉక్కు స్టేడియంలో యోగా చేస్తున్న విద్యార్థులు

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని ఎల్‌వీ నగర్ ఫీడర్‌కు శుక్రవారం నిర్వహణ పనులను చేపట్టనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డీఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఎల్‌వీ నగర్, తోకాడ, డ్రైవర్స్ కాలనీ, కుంచుమాంబ కాలనీలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ షీలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షీలానగర్, గవరజగ్గయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, నాతయ్యపాలెం, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్, పోర్టు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

గాంధీనగర్, వినాయకనగర్ ఫీడర్ల పరిధిలో..

పెదగంట్యాడ: గాంధీనగర్ 11కేవీ ఫీడర్, వినాయకనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ప్రకటనలో తెలిపారు. వినాయకనగర్ ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ, గొంతినవానిపాలెం, వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక, గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని సమతానగర్, చిన నడుపూరు, పెదనడుపూరు, వెంపళ్లనగర్, శీకువానిపాలెం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. 11కేవీ మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్ఎన్ఎయూఆర్ఎం కాలనీ బిల్డింగ్‌లు, 11కేవీ బీసీఎల్ ఫీడర్ పరిధిలోని దయాళ్‌నగర్, సంజీవకాలనీ, దయాల్‌నగర్ లోవ, గిరిజా కాలనీలోను పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో జగన్నాథ స్వామి

అగనంపూడి: భక్తుల ఆరాధ్యదైవం జగన్నాథ స్వామిని బుధవారం కూర్మావతారంలో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొండయ్యవలస మహిళలు లలితా సహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం ఉమామహేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సమర, కమిటీ సభ్యులు జి.సత్యవతి, బి.సన్యాసమ్మ, దేవరాజు, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ప్రాంతాల పరిశీలన



తహసీల్దార్ పాల్ కిరణ్‌తో మాట్లాడుతున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 67, 68 వార్డుల్లో గుడివాడ అప్పన్నకాలనీ నుంచి బొజ్జన్న కొండ మీదుగా గాజువాక హైస్కూల్ రోడ్డును కలుపుతున్న రహదారి విస్తరణ ప్రాంతాలను గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్, విద్యుత్ శాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం 20 అడుగులుగా ఉన్న రహదారిని 30 అడుగులకు విస్తరించాలని గుడివాడ అప్పన్న కాలనీ ప్రజలు కార్పొరేటర్ గుడివాడ అనూషకు వినతిపత్రం అందజేశారు. ఆమె విస్తరణ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు బుధవారం స్థల పరిశీలన చేశారు. అయితే, విస్తరణకు ప్రతిపాదించిన స్థలం విద్యుత్ సంస్థకు ఆనుకుని ఉండడంతో ఇరు శాఖల అధికారులు రోడ్డు విస్తరణకు సహకరించాలని లతీష్ కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

860వ రోజుకు 'ఉక్కు'రిలే దీక్షలు



860వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేనివ్వరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి, కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పట్టాలు అందుకున్న చిన్నారులతో అంగన్‌వాడీ నిర్వాహకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో ఐదు సంవత్సరాలు నిండి, ప్రైమరీ స్కూల్‌లో చేరుతున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పెదగంట్యాడ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. వారిలో భాషాభివృద్ధి, మేధాశక్తి పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రియదర్శినీ కాలనీ డీపీహెచ్ చక్రధర్, శ్రావణి, కృష్ణవేణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: పెందుర్తి మండలం పులగానిపాలెంలో పెందుర్తి పోలీసులు నాలుగు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఎస్ఐ ఆసిరి తాత తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం పులగానిపాలెం దరి అయ్యప్పకాలనీ దగ్గర బైక్‌లో గంజాయి ఉంచి ముగ్గురు వ్యక్తులు ఆగి ఉన్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అయితే ఇద్దరిని పట్టుకోగా ఒకరు తప్పించుకు పోయాడు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

సమయపాలనకు ప్రాధాన్యం



విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్.వి.ఆర్.నాయుడు

మురళీనగర్: ప్రతి విద్యార్థి సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని న్యూరో లింగ్విస్టిక్స్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్(యు.ఎస్.ఎ.), రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గెస్ట్ ఫ్యాకల్టీ, వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు ఎస్.వి.ఆర్. నాయుడు అన్నారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్టడీ స్కిల్స్ అండ్ టైం మేనేజ్‌మెంట్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్జెక్టుల్లో నైపుణ్య సాధనకు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం చదవడంతోపాటు నైపుణ్యాల సాధన, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఎస్.వి.ఆర్.నాయుడు నివృత్తి చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు, జనరల్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎం.బాషా, ఇంగ్లిష్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ కె.యమున, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లెక్చరర్ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న మెట్ల నిర్మాణం



శ్రీవారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మెట్లు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నడుస్తూ చేరుకునేందుకు మెట్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. మెట్ల నిర్మాణం పూర్తికాగా వాటి చుట్టూ గోడ, పైన శ్లాబ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి చేరుకునేందుకు ఇప్పటికే సుందరమైన ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. కొండ దిగువ భాగం నుంచి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వరకు ఉన్న శ్రీవారి శంఖు, నామ, చక్రాల వరకు ఈ మెట్లు ఉంటాయి. అక్కడ నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో ఆలయం ఉండటంతో భక్తులు సులభంగానే చేరుకోవచ్చు. మొత్తం 240 మెట్లు, మధ్యమధ్యలో ఫ్లాట్‌ఫారం నిర్మిస్తున్నారు. తిరుపతి తరహాలో భక్తులకు ఎండతోగానీ, వర్షంతోగానీ ఇబ్బంది లేకుండా ఉండేదుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు క్షేమంగా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోవచ్చు. మెట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, శ్రావణ మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. భక్తులు సులువుగా మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌లో, బీకాం(జనరల్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ కెమిస్ట్రీ-ఫిజిక్స్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీలోగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ గ్రూప్సుజీ ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని ఆమె కోరారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

సబ్బవరం: జీ–20 కార్యక్రమాల్లో భాగంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక సమీకృతం– అభివృద్ధి విభాగం అనే అంశంపై దేశ వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం శాఖ మేనేజర్ బిర్లంగి రాజారావు చెప్పారు. సబ్బవరం పాఠశాలలో బుధవారం నిర్వహించిన పోటీలకు మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 16 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ఎంఈవో అప్పలరాజు తెలిపారు.

వైభవంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నగరానికి చెందిన యువ రచయిత నిమ్మాని సంతోష్ రచించిన 'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ పి.వి.నారాయణరావు, బీజేపీ కన్వీనర్ కొప్పల రామ్‌కుమార్, జీవీపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ సరిపల్లే, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సంతోష్ మాట్లాడుతూ ఇంట్రోవర్ట్స్ అంటే అంతర్ముఖులని, నిజ జీవితంలో మనం ఇలాంటి వారిని చూస్తుంటామన్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా, జనాలకు దూరంగా, కలుపుగోలు తనం లేకుండా కొంతమంది మనకు తారసపడుతుంటారన్నారు. అటువంటి వారిని ఏ విధంగా మామూలు వ్యక్తులుగా మార్చుకోవాలి దానికి సంబంధించిన టెక్నిక్స్, ఎక్సర్‌సైజ్‌లు పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అతిథులు పేర్కొన్నారు. బుక్ మ్యాజిక్ లైబ్రరీ వ్యవస్థాపకుడు హరి మాదాల, పిక్ ఏ బుక్ సంస్థ ప్రతినిధి కృష్ణకిరణ్ పుస్తకాన్ని సమీక్షించారు.

దిశ పోలీసుల విచారణ

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com